సాక్షి జోగులాంబ గద్వాల

గురువారం • 4 • ఏప్రిల్ • 2024





జోరుగా ఉల్లి విక్రయాలు

దేవరకద్ర మార్కెట్‌లో బుధవారం ఉల్లి క్వింటాల్ గరిష్టంగా రూ.1,500 పలికింది.

వివరాలు 10లో ▸

గరిష్టం/కనిష్టం
43.3/24.5

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటూ అప్పుడప్పుడూ మేఘావృతమవుతుంది. మధ్యాహ్నం ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

న్యూస్‌రీల్

ఊరు ఖాళీ చేయమంటే ఎలా..?

గద్వాల రూరల్: సుమారు **80 ఏళ్ల కిందట** ఏర్పడిన గ్రామంలో తాము **మూడు తరాలుగా** నివాసముంటున్నామని, **ఉన్న ఫలంగా** కొందరు వ్యక్తులు వచ్చి ఈ **ఊరికి సంబంధించి** భూమి మాదంటూ ఊరిని **మొత్తాన్ని ఖాళీ** చేయాలంటున్నారని గట్టు **మండలం చమ**న్‌ఖాన్‌దొడ్డి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈమేరకు గ్రామానికి చెందిన భీమయ్య, నాగప్ప బుధవారం ఎస్పీకి వినతి పత్రం అందజేశారు. 80 ఏళ్లుగా గ్రామంలోనే నివాసముంటున్నామని, ఇప్పుడు ఇలా తమను బలవంతంగా పోలీసుల బందోబస్తుతో వచ్చి ఇళ్ల ఖాళీ చేయమంటే ఎక్కడికి పోవాలని తమకు న్యాయం చేయాలని వినతి పత్రంలో కోరారు.

వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్త వహించాలి


గద్వాల క్రైం: వేసవి నేపథ్యంలో పగటి ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా తగిన జాగ్రత్తలు వహించాలని జిల్లా ఇంచార్జ్ వైద్యాధికారిణి శశికళ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాతావరణ మార్పుల రీత్యా సాధారణ ఉష్ణోగ్రతల కంటే అధికంగా నమోదు అవుతున్నాయని, ఈ క్రమంలో ఎండల ధాటికి ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ద్రవపదార్థాలు సేవించాలని, పలుచని కాటన్ దుస్తులు ధరించాలని, ఎక్కువ నీటిని సేవించాలని, పరిశుభ్రమైన భోజనం చేయాలని, రెండు పూటల స్నానం చేస్తూ ఎండలో ఎక్కువగా బయటకి వెళ్లకూడదని ప్రజలకు సూచించారు. ఉదయం 11లోపు బయటి పనులు ముగించుకోవాలని, సాయంత్రం 4 తర్వాతే ఇంటి నుంచి బయటకు రావాలని సూచించారు. అత్యవసరమైతే గొడుగులు, టోపీలు వాడాలని, జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాథమిక ఆరోగ్య క్రేందాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచామని, వైద్యుల సలహాలు, సూచనలు ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు.

సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త



గద్వాల క్రైం: సైబర్ నేరస్తులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాల్సిందిగా సైబర్ క్రైం డీఎస్పీ సత్తయ్య అన్నారు. బుధవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిలోని వైద్య సిబ్బందికి సైబర్ నేరగాళ్లపై అవగాహన కల్పించారు. బ్యాంకు అధికారులు, ప్రైవేటు కంపెనీల ప్రతినిధులుగా అమాయక ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. ఎట్టి పరిస్థితిలో వ్యక్తిగత సమాచారం, పాస్‌వర్డ్‌లు చెప్పవద్దన్నారు. రుణాలు తక్కువ వడ్డీకే మంజూరు చేస్తామని బురిడీ కొట్టించి వారి ఖాతాలోంచి నగదును తస్కరించే ముఠాలు ఇటీవల ఎక్కువయ్యాయని, సామాజిక మాధ్యమాల నుంచి సైతం మోసం చేసే అవకాశం ఉందని, అనవసరమైన లింకులు ఓపెన్ చేయవద్దని సూచించారు. ఎవరైనా సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే వారికి అండగా నిలిచేందుకు జిల్లా వ్యాప్తంగా సైబర్ వారియర్స్ విధులు నిర్వహిస్తున్నారన్నారు. బాధితులు తక్షణమే 1930, ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఈ సమావేశంలో సీఐ రాజు, వైద్య సిబ్బంది కిషోర్‌కుమార్, వృశాలి తదితరులు ఉన్నారు.

ఎన్నికల సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి



గద్వాల రూరల్: ఎన్నికల విధులు నిర్వర్తించే అధికారులకు, సిబ్బందికి ఎదురయ్యే సమస్యలు పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ నాయకులు బుధవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. 800మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ బూత్‌లను గుర్తించి అదనంగా బూత్‌లు ఏర్పాటు చేయాలని, రిటైర్మెంట్‌కు దగ్గరగా ఉన్నవారికి, చంటిపిల్లలు, పాలిచ్చే తల్లులు, గర్భిణులు, దీర్ఘకాలిక వ్యాధులతో ఇబ్బందులు పడుతున్నవారికి ఎన్నికల విధుల నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో విధులు నిర్వర్తించే వారికి భోజన వసతులు, నిత్యకృత్యాలు తీర్చుకునేందుకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలన్నారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం సిబ్బంది, అధికారులు వారి స్వస్థలాలు చేరుకునేందుకు అవసరమైన రవాణా సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో చక్రధర్, చంద్రకాంత్, వెంకటరమణ, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యానికి మించి..!

మార్కెట్‌యార్డులకు కలిసొచ్చిన ట్రేడర్స్, చెక్‌పోస్టుల ఆదాయం



గద్వాల యార్డులో వేరుశనగ, వరి ధాన్యం రాశులు

- గద్వాల యార్డుకు ఏడాది పొడవునా వేరుశనగ రాక
- అయిజ సంత నుంచి తొలిసారి రూ.20లక్షల ఆదాయం
- రూ.3.25కోట్ల లక్ష్యానికి.. రూ.3.50 సాధించిన గద్వాల యార్డు
- రూ.2.16 కోట్ల లక్ష్యానికి.. రూ. 2.64 కోట్లు సాధించిన అలంపూర్ యార్డు

గద్వాల వ్యవసాయం: 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జిల్లాలోని గద్వాల, అలంపూర్ మార్కెట్‌యార్డులు ఆదాయ లక్ష్యాన్ని చేరుకున్నాయి. ట్రేడర్స్, చెక్‌పోస్టుల నుంచి ఆశించిన స్థాయిలో ఆదాయం సమకూరడంతో నడిగడ్డలోని రెండు యార్డులు లక్ష్యాన్ని దాటాయి. వానాకాలం, యాసంగి సీజన్‌లలో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు సరిగ్గా పండకపోయినా.. బోర్లు, బావుల కింద సాగు చేసిన వేరుశనగ ఏడాది పొడవునా గద్వాల యార్డుకు రావడం, అలంపూర్ యార్డు పరిధిలోని అయిజ సంత నుంచి తొలిసారి రూ.20లక్షలు సెస్ రూపంలో రావడం రెండు యార్డులకు కలిసొచ్చింది.

వ్యవసాయ ఆధారిత జిల్లా..

జోగుళాంబ గద్వాల వ్యవసాయ ఆధారిత జిల్లా. జూరాల, ఆర్డీఎస్ ప్రాజెక్ట్‌లతో పాటు, నెట్టెంపాడు ప్రాజెక్ట్ పరిధిలోని ఏడు రిజర్వాయర్లు, 120దాకా చెరువులు, ఇంకా కుంటలు ఉన్నాయి. దీంతో ఇక్కడ వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. ఏటా వానాకాలం సీజన్‌లో 1.27లక్షల హెక్టార్లు, యాసంగిలో 48వేల హెక్టార్లలో వరి, పత్తి, కంది, ఆముదం, వేరుశనగ, మొక్కజొన్న, ఎండుమిర్చి తదితర పంటలు రైతులు పండిస్తున్నారు. పండించిన పంట ఉత్పత్తులను విక్రయించేందుకు గద్వాల, అలంపూర్ మార్కెట్ యార్డులు ఉన్నాయి. ఇందులో అలంపూర్ మార్కెట్‌యార్డుకు అయిజ సబ్‌మార్కెట్‌గా ఉంది.

అలంపూర్ యార్డులో..

ఇక అలంపూర్ యార్డుకు సంబంధించి చెక్‌పోస్టుల ద్వారా రూ.1.26కోట్లు, ట్రేడర్స్ నుంచి రూ.1.05కోట్లు, అయిజ సంత నుంచి రూ. 20లక్షలు, దుకాణాల అద్దెలు రూ. 13లక్షల ఆదాయం వచ్చింది. ఈయార్డు లక్ష్యం రూ.2.16కోట్లు కాగా రూ. 2.64కోట్లు సాధించింది. దీంతో పాటు అలంపూర్ యార్డుకు సివిల్‌సప్లయి నుంచి రూ.43లక్షల బకాయి కూడా వచ్చింది. ఇదిలా ఉంటే అలంపూర్ యార్డుకు అయిజ సంత నుంచి తొలిసారి రూ.20లక్షల ఆదాయం వచ్చింది. గతంలో 2లక్షలకు మించి రాలేదు. ఈసారి యార్డు కార్యదర్శి ఎల్లస్వామి పర్యవేక్షణలో సిబ్బంది పకడ్బందీగా సెస్ వసూలు చేయడంతో ఆదాయం బాగా పెరిగింది. దీనికితోడు అక్కడి వ్యాపారులు కొన్న అన్ని పంట ఉత్పత్తులపై ఎప్పటికప్పుడు సెస్ వసూలు చేశారు.

ఆరేళ్లుగా మార్కెట్ యార్డుల ఆదాయ వివరాలిలా.. (రూ.కోట్లలో)

ఏడాది	గద్వాల లక్ష్యం	సమకూరిన ఆదాయం	అలంపూర్ లక్ష్యం	సమకూరిన ఆదాయం
2018-19	2.80	2.32	1.40	1.30
2019-20	2.98	3.16	1.57	1.67
2020-21	2.97	1.51	1.73	0.75
2021-22	4.16	4.19	1.78	1.73
2022-23	6.00	4.88	1.55	2.55
2023-24	3.25	3.50	2.16	2.64

లక్ష్యాన్ని చేరుకున్నాం



2023–24 ఆర్థిక సంవత్సరానికి గాను గద్వాల, అలంపూర్ యార్డులు నిర్దేశించిన లక్ష్యానికి మించి ఆదాయాన్ని అందుకున్నాయి. గద్వాల యార్డుకు నిత్యం వేరుశనగ వస్తోంది. వీటి క్రయ, విక్రయాల ద్వార సెస్ బాగా బాగా వచ్చింది. అలంపూర్ యార్డుకు సైతం ట్రేడ ర్స్ నుంచి బాగా ఆదాయం వచ్చింది. అయిజ సంత నుంచి ఈ సారి బాగా ఆదాయం సమకూరింది.

– పుష్ప, జిల్లా మార్కెటింగ్ అధికారి

రాష్ట్రంలోనే గద్వాల యార్డు ప్రసిద్ధి



గద్వాల యార్డులో వేరుశనగ కాంటా వేస్తున్న కార్మికులు

రాష్ట్రంలోనే గద్వాల మార్కెట్‌యార్డు ప్రసిద్ధిగాంచింది. దీనికి అనుబంధంగా పత్తి మార్కెట్, క్యాటిల్ మార్కెట్‌లు ఉన్నాయి. ఈయార్డు ప్రాంగణం నిత్యం ధాన్యపు రాశులతో కళకళలాడుతుంటుంది. జిల్లాలోని రైతులతో పాటు, మక్తల్, ఆత్మకూర్, పెబ్బేర్, కొల్లాపూర్ తదితర ప్రాంతాల నుంచి సైతం రైతులు తాము పండించిన పంట ఉత్పత్తులను విక్రయించేందుకు ఇక్కడికి తీసుకవస్తారు. ఇక అలంపూర్ మార్కెట్‌యార్డులలో రోజువారి పంట ఉత్పత్తుల కొనుగోళ్లు నిర్వహించరు. లైసెన్స్ ఉన్న ట్రేడర్స్ రైతుల నుంచి కొన్ని సార్లు పంట ఉత్పత్తులు కొనుగోలు చేసినప్పుడు యార్డుకు సెస్ లభిస్తుంది. దీంతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల నుంచి మాత్రమే డిమాండ్ మేరకు కూడా కొనుగోళ్లు జరుగుతుంటాయి. అయితే ఈమార్కెట్ యార్డుల పరిధి కింద ఎర్రవల్లి, పుల్లూరు, అయిజలలో చెక్‌పోస్టులు ఉన్నాయి. ఈచెక్‌పోస్టుల నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయం పైనే అలంపూర్ యార్డు కొనసాగుతోంది.

2023-24 యార్డుల పరిస్థితి ఇలా..

2023–24 ఏడాదిలో అటు వానాకాలం, ఇటు యాసంగి రెండు సీజన్‌లలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈపరిస్థితులు అన్ని రకాల పంటలపై తీవ్ర ప్రభావాన్ని చూపాయి. ఆశించిన స్థాయిలో పంట ఉత్పత్తులు వస్తేనే యార్డులకు సెస్ రూపంలో ఆదాయం వస్తుంది. అయితే వర్షాలు లేని కారణంగా గద్వాల యార్డుకు ఆశించిన స్థాయిలో పంట ఉత్పత్తులు రాలేదు. కాగా గద్వాల ప్రాంతంలో బోర్లు, బావుల కింద ఏటా మూడు సార్లు వేరుశనగ సాగు చేస్తున్నారు. ఈక్రమంలో ఏడాది పొడవునా యార్డుకు వేరుశనగ వచ్చింది. దీంతోపాటు పత్తి దిగుబడులు తగ్గినా, రైతులు తమ పత్తిని స్థానికంగా ఉన్న జిన్నింగ్, ప్రెస్సింగ్ మిల్లులో విక్రయించారు. ఇలా వేరుశనగ, ఇతర పంటల వల్ల ట్రేడర్స్ నుంచి రూ.2.47 కోట్లు, మిల్లుల నుంచి రూ.67.12 లక్షలు సెస్ రూపంలో గద్వాల యార్డుకు మంచి ఆదాయం వచ్చింది. ఇంకా చెక్‌పోస్టుల నుంచి రూ. 24.80 లక్షలు, పశువుల సంత నుంచి రూ. 5.28 లక్షలు, హోల్‌సేల్ కూరగాయల ట్రేడర్స్ నుంచి రూ. 5.18లక్షలు ఆదాయం సమకూరింది. నిర్దేశించిన లక్ష్యం రూ. 3.25కోట్లు కాగా..రూ.3.50కోట్లు సాధించింది. దీంతో పాటు గద్వాల యార్డుకు సివిల్ సప్లయి నుంచి రూ.1.61 కోట్లు బకాయి కూడా వచ్చింది.

ఇంటి దొంగల పనేనా?!



పెబ్బేరు గోదాంలో కాలిపోతున్న గన్నీ బ్యాగులు

- గన్నీబ్యాగులు అమ్ముకున్నట్లు ఆరోపణలు
- ఈ వ్యవహారం బయటికొస్తుందనే అగ్నిప్రమాద నాటకం
- మంటలు చెలరేగిన కంపార్ట్‌మెంట్ కిటికీ తెరుచుకోవడంపై అనుమానాలు
- ఫోరెన్సిక్ నిపుణులు వస్తేనే.. నిగ్గు తేలనున్న నిజాలు
- ఎట్టకేలకు తగ్గుముఖం పట్టిన మంటలు

వనపర్తి: పెబ్బేరు మార్కెట్ యార్డు గోదాంలో రూ.కోట్ల విలువ చేసే గన్నీబ్యాగులు తగలబడిన వ్యవహారంలో ఇంటి దొంగల హస్తం ఉందనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఖరీఫ్ కొనుగోళ్ల సమయంలో జిల్లాకు వచ్చిన గన్నీ బ్యాగులను అధికారులు ఇక్కడ నిల్వ చేశారు. అయితే యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయానికి మంటలు చెలరేగి కాలిపోవడం అనుమానాలకు తావిస్తోంది. ఈ కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తే.. పలు అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

జిల్లా సరిహద్దులు దాటిన గన్నీలు..

జిల్లా అవసరాలకు పౌరసరఫరాల శాఖ కొనుగోలు చేసిన గన్నీ బ్యాగుల్లో కొన్నింటిని నిబంధనలకు విరుద్ధంగా స్వలాభం కోసం గద్వాల జిల్లాకు తరలించినట్లు స్థానికంగా గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు ఎఫ్‌సీఐ కొత్త గన్నీ బ్యాగుల్లో బియ్యం నింపి తీసుకువస్తేనే.. అనుమతించడంతో స్థానిక మిల్లర్లు కొందరు అధికారులతో కుమ్మక్కై సీసీ కెమెరాలు లేని పెబ్బేరు మార్కెట్ యార్డులోని గోదాంలో నిల్వ చేసిన గన్నీ బ్యాగులను తక్కువ ధరకు సేకరించినట్లు ఆరోపణలు ఉన్నాయి. యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్ల సమయంలో గన్నీ బ్యాగులు పంపిణీ చేయాల్సి సమయంలో లెక్కల్లో తేడాలు వస్తే.. ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంటుందని, పథకం ప్రకారమే.. గోదాంలో ఉన్న గన్నీబ్యాగులకు నిప్పుపెట్టి.. ఇది వరకే అక్రమంగా తరలించిన గన్నీబ్యాగుల లెక్కతో కలిపి కాలిపోయినట్లు లెక్క చూపి ప్రమాద బీమాను వర్తింపజేసుకునే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది.

తప్పును కప్పి పుచ్చుకునేందుకు..

పక్కదారి పట్టించిన గన్నీ బ్యాగుల వ్యవహారాన్ని అధికారికంగా చక్కదిద్దేందుకు కొందరు మిల్లర్లు, అక్రమార్కులైన అధికారులతో కుమ్మక్కై వేసి మాస్టర్ ప్లాన్‌లో భాగమే ఈ అగ్ని ప్రమాదం అన్న చర్చలు స్థానికంగా వినిపిస్తున్నాయి. ఈ అంశంపై పౌరసరఫరాల కార్పొరేషన్ అధికారులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు డీఎస్పీ స్థాయి అధికారి ఆధ్వర్యంలో విచారణ చేపట్టినట్లు తెలుస్తోంది. మంటలు పూర్తిగా ఆరిన తర్వాత ఫోరెన్సిక్ నిపుణులను రప్పించి ఆధారాలను సేకరిస్తే గాని ఈ విషయం కొలికి వచ్చేలా లేదు.

ఆ కిటికీ ఎలా తెరుచుకుంది..

అగ్ని ప్రమాదానికి గురైన గోదాం రెండో కంపార్ట్‌మెంట్‌లోని ఒక కిటికీ ప్రమాదం జరిగిన సమయంలో ఎలా తెరుచుకుని ఉందనే విషయంలో అధికారులకు అనుమానాలు ఉన్నట్లు తెలుస్తోంది. సంఘటనా స్థలాన్ని సందర్శించిన ఓ జిల్లా అధికారి ఇనుప కిటికీలు బయట నుంచి తెరవడం సాధ్యం కాదని, ఇక్కడ ఎలా తెరుచుకుని ఉందని మార్కెటింగ్, సివిల్ సప్లయ్ శాఖ అధికారులతో ఆరా తీసినట్లు సమాచారం. గోదాం లోపలి నుంచి మాత్రమే తీసేందుకు అవకాశం ఉంటుంది. ఇదే కిటికీ నుంచి పథకం ప్రకారం నిప్పు పెట్టి ఉంటారనే ఆరోపణలు లేకపోలేదు.

ఇంకా చల్లరాని మంటలు

మార్కెట్ యార్డ్ గోదాంలో సోమవారం సాయంత్రం అగ్నిప్రమాదంతో చెలరేగిన మంటలు బుధవారం రాత్రి వరకు కూడా చల్లారలేదు. అగ్నిమాపక సిబ్బంది మంటలు ఆర్పేందుకు ప్రయత్నం చేస్తున్నారు. గోదాంలో నుంచి గన్నీ బ్యాగులను బయటికి తీస్తూ ఆర్పేస్తున్నారు. సంఘటన స్థలంలో కొనసాగుతున్న పనులను అదనపు కలెక్టర్ నాగేష్, ఆర్డీఓ పద్మావతి, తహసీల్దార్ లక్ష్మి పర్యవేక్షించారు. మార్కెట్ యార్డును ఏఐసీసీ స్టేట్ కోఆర్డినేటర్ జిల్లెల ఆదిత్యరెడ్డి గారు పరిశీలించారు. అధికారులతో మాట్లాడి వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేసి మంటలు పూర్తిగా ఆర్పివేయాలని సూచించారు.



గన్నీబ్యాగులను బయటికి తీసుకొస్తున్న ప్రొక్లెయినర్లు

ఇటు బ్యాగులకు.. అటు గోదాంకు ఇన్సూరెన్స్

గోదాంలో నిల్వ చేసిన గన్నీ బ్యాగులకు, నాబార్డు నిధులు రూ.3 కోట్లతో మూడు కంపార్ట్‌మెంట్లతో నిర్మించిన గోదాంకు ఇన్సూరెన్స్ ఉండగా.. 1, 3 కంపార్ట్‌మెంట్లలో నిల్వ చేసిన ధాన్యానికి మాత్రం ఇన్సూరెన్స్ లేదు. ఏది ఏమైనా తీసుకున్న ధాన్యానికి ఇవ్వాల్సిన లెక్క పద్ధతిన సీఎంఆర్ బియ్యం అప్పగించాల్సిందే. ఎటు వైపు నుంచి చూసినా గన్నీ బ్యాగులను తగులబెట్టే అవసరం అమ్ముకున్న వారికి.. అధికారులతో కలిసి కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఉంటుందన్న వాదనలు స్థానికంగా వినిపిస్తున్నాయి.



సహాయకచర్యల కోసం పగులగొట్టిన గోదాం గోడలు

రంగంలోకి దిగితేనే..

మంటలు పూర్తిగా అదుపులోకి వచ్చి ఫోరెన్సిక్ నిపుణులు రంగంలోకి దిగితేనే ప్రమాదానికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంది. బుధవారం సాయంత్రం వరకు మంటలు దాదాపుగా అదుపులోకి వచ్చాయి. పొగలు కక్కుతున్న గన్నీ బ్యాగుల కట్టలను ప్రొక్లెయినర్ సాయంతో గోదాం నుంచి బయటకు తరలించే పనిలో ప్రస్తుతం అగ్నిమాపక సిబ్బంది నిమగ్నమయ్యారు. కాలిపోయిన గన్నీ బ్యాగుల కట్టలు (బెల్స్)ను అధికారులు పంచనామా చేసిన తర్వాతనే అక్కడి నుంచి తరలించే అవకాశం ఉంటుంది.

అనుమానాలున్నాయి..

గన్నీ బ్యాగుల దహనం విషయంలో బాధ్యులు ఎంతటి వారైనా చర్యలు తప్పవు. దీనిపై ఇప్పటికే పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ ప్రారంభించారు. ఫోరెన్సిక్ నిపుణులు ఆధారాలు సేకరిస్తే నిజాలు వెలుగులోకి వస్తాయి. జరిగింది ప్రమాదం కాదని.. ఉద్దేశపూర్వకంగానే చేసినట్లు మాకూ అనుమానాలున్నాయి.

– బాలు, అసిస్టెంట్ మేనేజర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్, వనపర్తి జిల్లా

పారదర్శకంగా ఈవీఎంల ర్యాండమైజేషన్



మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల రూరల్: ఈవీఎం యంత్రాల మొదటి దశ ర్యాండమైజేషన్ పారదర్శకంగా పూర్తి చేసినట్లు కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. బుధవారం ఐడీవోసీ కార్యాయంలో కాన్ఫరెన్స్ హాలులో అదనపు కలెక్టర్ ముసిని వెంకటేశ్వర్లుతో కలిసి ఈవీఎం యంత్రాల మొదటిదశ ర్యాండమైజేషన్ ప్రక్రియ నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ భారత ఎన్నికల కమీషన్ మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా ఈవీఎం యంత్రాల ర్యాండమైజేషన్ ప్రక్రియను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో చేపట్టామని అన్నారు. జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాలలో గల 594పోలింగ్ కేంద్రాలకు ఆన్‌లైన్ ద్వారా ఈవీఎం యంత్రాలను కేటాయించడం జరిగిందన్నారు. గద్వాల అసెంబ్లీ పరిధిలో 378 కంట్రోల్ యూనిట్లు, 378 బ్యాలెట్ యూనిట్లు, 424 వీవీ ప్యాట్లు కేటాయించగా, అలంపూరు అసెంబ్లీ పరిధిలో 363 కంట్రోల్ యూనిట్లు, 363 బ్యాలెట్ యూనిట్లు, 407 వీవీ ప్యాట్లను రాకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఆన్‌లైన్ విధానం ద్వారా పారదర్శకంగా మొదటి దశ ర్యాండమైజేషన్ నిర్వహించి కేటాయించడం జరిగిందన్నారు. వీటికి సంబంధించి హార్డ్‌కాపీలు, సాఫ్ట్ కాపీలు రాకీయ పార్టీల ప్రతినిధులకు అందించడం జరుగుందన్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల విభాగం సూపరిండెంట్ నరేష్, తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, మంజుల, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల కాంగ్రెస్ కోఆర్డినేటర్ల నియామకం

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతోంది. ఇటీవలే పార్లమెంట్ నియోజకవర్గానికి ఇన్‌చార్జీల నియామకం చేయగా ఇప్పుడు అసెంబ్లీ నియోజకవర్గాలకు కోఆర్డినేటర్లను నియమించింది. టీపీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి ఆమోదం మేరకు అసెంబ్లీ నియోజకవర్గాల కోఆర్డినేటర్లను నియామకం చేస్తూ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్‌గౌడ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లాలో కొడంగల్ అసెంబ్లీ నియోజకవర్గానికి కోఆర్డినేటర్లుగా మంగి జైపాల్ రెడ్డి, కల్వ సుజాత, నారాయణపేటకు ఈ.అనిల్ కుమార్, మహబూబ్‌నగర్‌కు నూతి శ్రీకాంత్‌గౌడ్, జడ్చర్లకు ఎం.అనిల్‌కుమార్ యాదవ్, దేవరకద్రకు మన్నె జీవన్‌రెడ్డి, మక్తల్‌కు ఏపీ జితేందర్ రెడ్డి, వనపర్తికి హంష వర్మ, గద్వాలకు రఘువీరారెడ్డి, చెన్నకేశవరెడ్డి, అలంపూర్‌కు ఎం.సత్యారెడ్డి, బల్గేర నారాయణరెడ్డి, నాగర్‌కర్నూల్‌కు బెక్కరి అనిత, ఖాజా హుస్సేన్ మక్సూద్, అచ్చంపేటకు ఎ.రాము యాదవ్, తిరుపతిరెడ్డి, కల్వకుర్తికి కప్కర్ ఘన్‌రాజ్, ఇందిరా శోభన్, షాద్‌నగర్‌కు కె.శివసేనారెడ్డి, కొల్లాపూర్‌కు గంధం రాజశేఖర్, దార భాస్కర్‌లను కోఆర్డినేటర్లుగా నియమించారు.

అవసరమైతేనే బయటికి రావాలి

గద్వాల రూరల్: వేసవికాలంలో ఎండదెబ్బ తగలకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని, అవసరమైతేనే ఇంటి నుంచి బయటికి రావాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. ఉదయం 11గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు బయటకు వెళ్లరాదన్నారు. అదేవిధంగా ఆల్కహాల్, కాఫీ, టీ, స్వీట్లు, చల్లని కూల్ డ్రింక్స్‌లను తీసుకోకుండా జాగ్రత్త పాటించాలన్నారు. అధిక శరీర ఉష్ణోగ్రత, అలసట, ఒంటినొప్పులు, వాంతులు, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రులకు వెళ్లి చికిత్స తీసుకోవాలన్నారు. అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఎర్రవల్లిచౌరస్తా: పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఆర్డీఓ రాంచందర్ అన్నారు. బుధవారం ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలలో పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వహించే అలంపూర్ నియోజకవర్గంలోని అధికారులకు మూడో రోజు అందిస్తున్న శిక్షణ తరగతులను ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు, సలహాలను అందించారు. పీఓ, ఏపీఓలు తప్పకుండా ఈవీఎంల పనితీరును స్పష్టంగా తెలుసుకోవాలని, శిక్షణ పొందిన పీఓ, ఏపీఓలు పోలింగ్ బూత్‌లతో సమర్థవంతంగా ఎన్నికల నిర్వహణ చేపట్టాలని సూచించారు. ఎలాంటి సందేహాలున్నా శిక్షణ తరగతుల్లో మాస్టర్ ట్రైనర్లచే నివృతి చేసుకోవాలని తెలిపారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు



అధికారులకు సూచనలు చేస్తున్న అడిషినల్ కలెక్టర్ అపూర్వచౌహాన్

అయిజ: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా ఉండేందుకు చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్ ఆదేశించారు. బుధవారం మండలంలోని కేశవరాన్ని ఆయన సందర్శించారు. గ్రామస్తులతో మాట్లాడి తాగునీటి సమస్య గురించి ఆరా తీశారు. ప్రస్తుతానికి తాగునీటి సమస్య ఏమీ లేదని, మిషన్ భగీరథ నీరు సరఫరా అవుతుందని తెలిపారు. అయితే ఎండలు ముదిరేకొద్ది తాగునీటితోపాటు అవసరాలకు ఉపయోగించుకునే నీరు ఎక్కువ కావాల్సి వస్తుందన్నారు. నదిలో చెలిమలు తవ్వి తాగునీటిని ఎందుకు తెచ్చుకుంటున్నారని గ్రామస్తులను అడగగా.. కొన్ని కుటుంబాలు వాటిని వాడుకోవడం అలవాటైందని, కొంతమంది మాత్రమే అలా తెచ్చుకుంటున్నారని గ్రామస్తులు తెలిపారు. గ్రామంలో గతంలో ఉన్న బోరుబావిలోకి మరో రెండు పైపులు అదనంగా దించాలని, అవసరమైతే కొత్త బోరుబావి వేయాలని ఆదేశించారు. కార్యక్రమంలోడీపీఓ వెంకటరెడ్డి, విషన్ భగీరథ ఎస్ఈ జగనమోహన్, డీఈ నాగరాజు, ఏఈ జాకీర్, ఎంపీఓ నరసింహారెడ్డి, గ్రామ కార్యదర్శి భాస్కర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

వేరుశనగ క్వింటా @ 6,744

గద్వాల వ్యవసాయం: గద్వాల మార్కెట్‌యార్డుకు బుధవారం 737 క్వింటాళ్ల వేరుశనగ రాగా, గరిష్టం రూ.6744, కనిష్టం రూ.3700, సరాసరి రూ.5389 ధరలు పలికాయి. అలాగే, 251 క్వింటాళ్ల ఆముదం రాగా గరిష్టం రూ.5619, కనిష్టం రూ.3000, సరాసరి రూ.5589 ధరలు వచ్చాయి. దీంతోపాటు క్వింటా కంది రాగా గరిష్టం, కనిష్టం, సరాసరి రూ.7866 ధర పలికింది.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఉండవెల్లి: మండలంలోని తక్కశిల శివారులో గత నెల 28న రెండు బైకుల ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరికి గాయాలు కాగా, అందులో గొల్ల వెంకట్రాముడు (59) చికిత్స పొందుతు మంగళవారం రాత్రి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ ప్రసాద్ తెలిపారు. కుమారుడు గొల్ల శేఖర్ ఫిర్యాదు మేరకు ప్రాగటూరు చెందిన భీమేష్‌పై బుధవారం కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

కరెంట్ షాక్‌తో విద్యార్థి..


నరేష్‌కుమార్ (ఫైల్)

మక్తల్: కరెంట్‌షాక్‌తో విద్యార్థి మృతి చెందిన ఘటన మండలంలోని కర్ని గ్రామంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే గ్రామానికి చెందిన రాజు, రంగమ్మ దంపతులకు ముగ్గురు సంతానం ఉన్నారు. వారిలో మూడో వాడు నరేష్‌కుమార్ (10). పట్టణంలోని సాయిజ్యోతి పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం పాఠశాలకు వెళ్లే సమయంలో నరేష్‌కుమార్‌ను తాత కిష్టప్ప ఇంటిపై కందులు ఆరబోశామని వాటిని చూసి రమ్మని చెప్పాడు. పైకి వెళ్లి కిందకి దిగే సమయంలో ఇంట్లోకు వెళ్లే సర్వీస్ వైర్‌కి అతుకులు ఉండడంతో తగిలి షాక్‌కు గురైయ్యాడు. ఇంటి పక్కనే ఉన్న శ్రీహరి గమనించి కర్రతో కొట్టాడు. అతన్ని వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. విద్యార్థి మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

నవాబుపేట: కుటుంబకలహాలతో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని లింగంపల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గోవిందుగారి యాదయ్య(38) బుధవారం కుటుంబ కలహాలతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. ఆలస్యంగా గమనించిన కుటుంబ సభ్యులు అతన్ని కిందకి దింపి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడి భార్య సువర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అభిషేక్‌రెడ్డి తెలిపారు.

బస్సు, లారీ ఢీ: ఒకరికి తీవ్ర గాయాలు

మహమ్మదాబాద్: ఎదురెదురుగా ఆర్టీసీ బస్సు, లారీ ఢీకొన్న ఘటన గండేడ్ మండలంలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మండలంలోని అంచన్‌పల్లి గేటు సమీపంలో తాండూరు నుంచి మహబూబ్‌నగర్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును మహబూబ్‌నగర్ వైపు నుంచి తాండూరు సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్తున్న లారీ ఢీకొంది. దీంతో బస్సులో ఉన్న హస్నాబాద్‌కు చెందిన ప్రయాణికుడి చేయి విరిగి, తలకు గాయాలయ్యాయి. వెంటనే ఆయనను మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. లారీ డ్రైవర్‌పై కేసునమోదు చేసుకుని స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ అజాగ్రత్తగా నడుపడం వల్ల ఘటన చోటు చేసుకున్నదని ప్రయాణికులు తెలిపారు.

కార్మికుడికి గాయాలు

కొత్తకోట రూరల్: మండలంలోని అప్పరాల శివారులో గల కృష్ణవేణి షుగర్ ఫ్యాక్టరీలో భూత్పూర్ చెందిన నక్క ఆంజనేయులు బొలెరో వాహన డ్రైవర్‌గా పని చేస్తుండేవాడు. ఫ్యాక్టరీలోని బొగ్గు తయారయ్యే కేంద్రంలో మంగళవారం రాత్రి అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో అక్కడే ఉన్న కొంత మంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా అందులో ఆంజనేయులు ఉన్నాడు. మంటలు అదుపులోకి తీసుకొచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు ఆంజనేయులుకు మంటలు అంటుకున్నాయి. గాయాలైన ఆయనను కొత్తకోటలోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లో తరలించి చికిత్స అందిస్తున్నారు.

3వేల వరిధాన్యం బస్తాల చోరీ

వెల్దండ: మండలంలోని పెద్దాపూర్ వద్ద ఉన్న మార్కెట్ యార్డు గోదాంలో నిల్వ ఉంచిన 3వేల వరిధాన్యం బస్తాలు చోరీకి గురైనట్లు ఎస్‌ఐ రవి పేర్కొన్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. కల్వకుర్తికి చెందిన వ్యాపారి రమేష్ బాబు గతంలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని పెద్దాపూర్ గోదాంలో నిల్వ చేశారు. బుధవారం ధాన్యం తీసేందుకు వెళ్లి చూడగా బస్తాలు చోరీకి గురైనట్లు గమనించారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వాటి విలువ సుమారుగా రూ.25లక్షల విలువ ఉంటుందని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.



రోళ్లకు పెరుగుతున్న ఆదరణ

- నెల్లూరు, చిత్తూరు నుంచి వచ్చి అమ్మకాలు
- ఆరోగ్యానికి, రుచికి ఇదొక చిట్కా అంటున్న గృహిణులు


అమ్మకానికి సిద్ధంగా ఉన్న రోళ్లు

రాజోళి: కరెంట్ బిల్లు వస్తుందనే దిగులు లేదు. మిక్సీల మోత లేదు. గ్రైండర్ వేసేందుకు బయటకు వెళ్లాల్సిన పని లేదు. అన్ని పనులు చేసుకునేందుకు పరికరాలు వచ్చినప్పటికి. నేటికి గృహిణుల్లో మాత్రం అలనాటి రోకలి బండలకు ఆదరణ పెరుగుతుంది. దీంతో అవి తయారుచేసే వారికి చేతి నిండా పని దొరుకుతుంది.

మంచి ఆదరణ

నేటి ఆధునిక యుగంలో అన్ని పనులు క్షణాల్లో పూర్తి చేసుకునేందుకు ఎన్నో పరికరాలు, యంత్రాలు అందుబాటులోకి వచ్చాయి. అందులో వాషింగ్ మిషన్, ఇల్లు శుభ్రం చేసుకునే పరికరాలు ఇలా ఎన్నో ఉన్నప్పటికీ ప్రధానంగా గృహిణులు వాడేది మాత్రం మిక్సీలు, గ్రైండర్లు. వంట గదిలో చేసే వంటల నుంచి చట్నీలు, జ్యూస్‌లు అన్నింటికి వీటిని ఎక్కువగా వాడుతుంటారు. కాని నాటి కాలంలో ప్రతి చిన్న దానికి రాతి పరికరాలతో చేసిన వాటినే వాడుకునేవారు. అందులో రోలు, రోకలి, విసుర్రాయి(తిరగలి) ప్రధానమైనవి. విసుర్రాయిలో జొన్నలు, కొర్రలు, బియ్యం విసురుకునే వారు. ప్రతిరోజు వంటలకు అవసరమయ్యే వాటిని రోలు, రోకలిని వాడుకునేవారు. పండుగలకు ఎక్కువ మొత్తంలో పూర్ణం, ఇతర వంటలకు సంబంధించిన పదార్థాలను తయారు చేసుకునేందుకు కూడా ప్రత్యేకంగా తయారు చేసిన వాటిని వాడేవారు. రోజువారి వంటలకు, ఎక్కువ మొత్తంలో చేసేందుకు ప్రత్యేకంగా తయారు చేసిన రాళ్లతో చేసిన పరికరాలను వాడేవారు. ప్రస్తుతం కూడా రోజువారి వంటలకు ఈ రాళ్లతో తయారుచేసిన వాటికి మంచి ఆదరణ పెరిగింది.


శాంతినగర్‌లో రోళ్లను తయారు చేస్తున్న నెల్లూరువాసులు


వివిధ ఆకృతుల్లో తయారు చేస్తున్న ఉత్పత్తిదారులు

ఇతర ప్రాంతాల నుండి వచ్చి..

రాతి పరికరాలపై పెరుగుతున్న డిమాండ్ ఆధారంగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వాటి అమ్మకాలను పెంచుకున్నారు. చిన్న సైజు నుంచి పెద్ద పరిమాణంలో చేసిన రాళ్లను తయారు చేసి అమ్మకాలు పెంచుకుంటున్నారు. చిత్తూరు, నెల్లూరు జిల్లాల నుంచి వచ్చిన వ్యాపారులు గద్వాల జిల్లాలో ప్రస్తుతం అమ్మకాలు చేస్తున్నారు. కొద్ది మందితో వారు చుట్టు పక్కల గ్రామాలకు అనువుగా ఒక కేంద్రంగా ఏర్పాటు చేసుకుని అక్కడే ఉండి అమ్మకాలు చేయడంతో పాటు, ద్వి చక్రవాహనాలపై వాటిన ఇతీసుకెళ్లి అమ్మకాలు చేస్తున్నారు. పెరుగుతున్న ఆదరణ కారణంగా వారికి కూడా మంచి ఉపాధి లభిస్తుందని ఉత్పత్తిదారులు అంటున్నారు. రోజులు తరబడి ఒక ప్రాంతంలో ఉండి, అక్కడ వాటి అమ్మకాలు ముగియగానే, మరొక ప్రాంతంలోకి వెళ్తామని వారు అంటున్నారు. ఏది ఏమైనా అలనాటి కాలంలో రుచికి ఆరోగ్యానికి వాడే రాతి పరికరాలు, మళ్లీ అందుబాటులోకి రావడంతో నేటి మిక్సీల వాడకం తగ్గి అలనాటి గ్రైండర్లకు బాగా ఆదరణ పెరుగుతుంది.

రుచిలో చాలా తేడా ఉంటుంది



ప్రస్తుతం చట్నీలకు, ఇతర వంటల్లో వాడే పలు రకాల మసాలలకు మిక్సీలను వాడుతున్నప్పటికీ, రోలులో రుబ్బితే వచ్చే రుచి వేరుగా ఉంటుంది. మా చిన్నతనంలో ఇంట్లో వీటిని వాడేవారు. ప్రస్తుతం మార్కెట్‌లో ఇవి అందుబాటులోకి వచ్చాయి. అన్ని రకాల రోళ్లు, విసుర్రాయిలు కూడా అందుబాటులో ఉండటంతో వాటి నుంచి బహుళ ప్రయోజనాలు ఉన్నాయి.

– శ్రీదేవి, గృహిణి, అయిజ

ఆదరణ లభిస్తుంది..



మేము నెల్లూరు నుంచి వచ్చాం. వీటిని తయారు చేసి, అమ్మడమే మా వృత్తి. గతంలో కంటే ప్రస్తుతం రోళ్లకు, ఇతర పరికరాలకు ఆదరణ బాగా పెరిగింది. అన్ని సైజులో ఇవి లభిస్తుండంతో మహిళలు రెండు నుంచి మూడు దాకా కొంటున్నారు. ఎక్కడికి వెళ్లినా వీటిపై మహిళలు ఆసక్తి కనబరుస్తున్నారు. కొనుగోలు పెరగడంతో మాకు ఉపాధి బాగా లభిస్తుంది.

– సందీప్, ఉత్పత్తిదారుడు, నెల్లూరు

సీటు కేటాయించకపోవడం బాధాకరం


అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మాదిగల జనాభా 75 శాతం ఉన్నా ఒక్క ఎంపీ సీటు కేటాయించకపోవడాన్ని నిరసిస్తూ ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ధర్నా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేయడానికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సంధ్య కార్తీక్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో 17 పార్లమెంట్ స్థానాలు ఉంటే అందులో ఒక్క సీటు కూడా మాదిగలకు కేటాయించకపోవడం బాధాకరమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ పూర్తిగా మాలల పార్టీగా మారిపోయిందని ఆరోపించారు. కడియం శ్రీహరి 40 ఏళ్ల రాజకీయ జీవితంలో ఒక్క మాదిగ బిడ్డను కూడా ఎదగనీయకుండా నేను మాదిగను అని చెప్పుకుంటూ తన రాజకీయ జీవితం అంచెలంచెలుగా ఎదుగుకుంటూ ఇప్పుడు వరంగల్ పార్లమెంట్ సీటు తన కూతురు కావ్యకు ఇప్పించడం మాదిగలకు బాధాకరమని అన్నారు. మాదిగలు కడియం కావ్యను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో శ్రీరాములు, కొండన్న, లేపాక్షి, కాన్షీరాం, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమరం.. సిబ్బంది సిద్ధం

- పార్లమెంట్ ఎన్నికలకు యంత్రాంగ సన్నద్ధం
- ఉద్యోగుల ఖాతాకు నేరుగా భత్యం


నాగర్‌కర్నూల్‌లో మొదటి విడత ర్యాండమైజేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ పి.ఉదయ్‌కుమార్

అచ్చంపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణపై ఈసీ ప్రత్యేక దృష్టి సారిస్తోంది. ఓటరు నమోదు నుంచి అభ్యర్థుల నామినేషన్లు, పోలింగ్, కౌంటింగ్ వరకు ప్రతి ఘట్టంలో అధికారులు ఎన్నికల సిబ్బంది కీలకంగా వ్యవహరిస్తారు. వీరి ఎంపిక ప్రక్రియను ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఆయా జిల్లాల యంత్రాంగాలు కొన్ని నెలల ముందే ప్రారంభించాయి. ఎన్నికల సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను కలెక్టర్లు ఇటీవల పూర్తి చేశారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో నాగర్‌కర్నూల్, అచ్చంపేట, కల్వకుర్తి, కొల్లాపూర్, వనపర్తి, గద్వాల, అలంపూర్ అసెంబ్లీ నియోజకవర్గాలుండగా.. ఆయా ప్రాంతాల్లో ఎన్నికల సిబ్బందిని నియమించనున్నారు. ఎన్నికల్లో వివిధ దశలు, విభాగాల్లో ఉద్యోగులను కేటాయించడం పరిపాటి. ఈ క్రమంలో ఎన్నికల యంత్రాంగం ఎన్నికల పరంగా ఉద్యోగుల సేవలు సిద్ధం చేస్తోంది. ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్లు ర్యాండమైజేషన్ మూడో విడత కూడా వారం రోజుల్లో నిర్వహించనున్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే అధికారులు, ఉద్యోగుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. ఎన్నికల భత్యాన్ని నేరుగా సిబ్బంది ఖాతాల్లో జమ చేసేందుకు ఉద్యోగుల బ్యాంకు ఖాతాలను సేకరిస్తున్నారు.

సహాయ రిటర్నింగ్ అధికారులుగా..

గత అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి శాసనసభ నియోజకవర్గానికి ఒక ఆర్‌ఓను ఎన్నికల సంఘం నియమించింది. అలాంటి వారందరూ లోక్‌సభ ఎన్నికల సమయంలో సహాయ రిటర్నింగ్ అధికారులుగా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. నాగర్‌కర్నూల్‌లో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు ఏడుగురు ఏఆర్‌ఓలుగా వ్యవహరిస్తారు. ఎన్నికల నిర్వహణలో ఆర్‌ఓకు సహకరించడంతో పాటు సంబంధిత శాసనసభ నియోజకవర్గాల పరిధిలో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు తీసుకుంటారు.

సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం

ఎన్నికల ప్రక్రియ సజావుగా జరగటంలో సెక్టోరల్ అధికారుల పాత్ర కీలకం. వీరి పరిధిలో 6 నుంచి 9 పోలింగ్ కేంద్రాలు ఉంటాయి. పోలింగ్ కేంద్రాల్లో ర్యాంపులు, నీరు, విద్యుత్, ఫ్యాన్లు తదితరు మౌలిక వసతులు వీరు కల్పించాల్సి ఉంటుంది. పార్లమెంట్ పరిధిలో 219 మంది సెక్టోరల్ అధికారులు విధులు నిర్వర్తించనున్నారు.

త్వరలోనే శిక్షణ..

ఎన్నికల నిర్వహణకు సంబంధించిన సామగ్రిని పోలింగ్‌కు ముందు ఆయా నియోజకవర్గాలకు సరఫరా చేయనున్నారు. ఇప్పటికే ర్యాండమైజేషన్ కొనసాగగా.. మరోసారి నిర్వహించనున్నారు. 1,944 పోలింగ్ కేంద్రాలు ఉండగా.. అందుకు అనుగుణంగా ఈవీఎంలు, వీవీ ప్యాట్లు సరఫరా చేయనున్నారు. కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీ ప్యాట్లు పరికరాలను వినియోగించనున్నారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఎన్నికలకు సబంధించిన గైడ్‌లెన్స్ అధికారులకు అందజేయగా.. ఏప్రిల్ 1 నుంచి 4 వరకు కలెక్టరేట్‌లో శిక్షణ తరగతుల నిర్వహించనున్నారు. ఎన్నికల్లో వ్యవహరించిన తీరు, పోలింగ్ రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై నోడల్ అధికారులు శిక్షణ ఇచ్చారు. జిల్లా, మండల స్థాయిల్లో మరోసారి శిక్షణ ఇవ్వనున్నారు.

వివరాలు, ఓటరు ఐడీ నమోదు..

ఉద్యోగుల ఓటరు గుర్తింపు కార్డులతో పాటు బ్యాంకు ఖాతా నంబరు, ఐఎస్ఎస్సీ కోడ్ నమోదు చేయాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఈ క్రమంలో ప్రతి ఉద్యోగి వివరాలను ఆయా శాఖల పర్యవేక్షకులు నమోదు చేస్తున్నారు. ఉద్యోగి పేరు, పనిచేస్తున్న శాఖ, సొంత మండలం, నియోజకవర్గం, విధుల్లో ఎప్పుడు చేరారు? పదవీ విరమణ ఎప్పుడు, ప్రస్తుతం పనిచేస్తున్న చోట ఎన్నాళ్లు నుంచి చేస్తున్నారు? తదితర వివరాల ఆధారంగా ఎన్నికల విధులను అప్పగించనున్నారు. సొంత మండలంలో కాకుండా మరో మండలంలో విధులు నిర్వహించాల్సి ఉంటుంది. సొంత ప్రాంతంలో బాధ్యతలు అప్పగిస్తే స్థానిక ప్రభావం ఉంటుదనే ఉద్దేశంతో ఈ విధానాన్ని పాటిస్తున్నారు. వెబ్‌సైట్‌లో వివరాల నమోదు ప్రక్రియ పూర్తియిన తర్వాత పోలింగ్‌కు ఒకరోజు ముందు వరకు ఎవరికి ఎక్కడ విధులన్నిది అత్యంత గోప్యం ఉంచనున్నారు.

ఆర్‌ఓగా కలెక్టర్

శాసనసభ, లోక్‌సభ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ)ని నియమిస్తోంది. ప్రతి లోక్‌సభ స్థానానికి సంబంధించి కలెక్టర్ ఆర్‌ఓగా బాధ్యతలు నిర్వర్తిస్తారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి కలెక్టర్ ఉదయ్‌కుమార్ ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తుండగా.. ఇక్కడి నుంచే పర్యవేక్షణ కొనసాగనుంది. నామినేషన్ ప్రక్రియ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోలింగ్ సిబ్బంది నియామకం, శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వంటి అంశాలు సదరు ఆర్‌ఓ పర్యవేక్షణలో కొనసాగుతాయి.

పోలింగ్ కేంద్రాలకు నలుగురు సిబ్బంది

ప్రతి పోలింగ్ కేంద్రానికి ఓ ప్రిసైడింగ్ అధికారి(పీఓ)ని నియమిస్తారు. ఈవీఎంలు, వీవీ ప్యాట్లను పోలింగ్ కేంద్రానికి తీసుకొచ్చి.. ఓటింగ్ అనంతరం వాటిని స్ట్రాంగ్ రూంకు చేర్చే వరకు పీఓ బాధ్యత వహిస్తారు. సహాయకారిగా అదనపు ప్రిసైడింగ్ అధికారి(ఏపీఓ) ఉంటారు. వీరితో పాటు ఇద్దరు పోలింగ్ అధికారులు(ఓపీఓ) విధులు నిర్వరిస్తారు. ఒకరు ఓటర్లకు ఇంకు పూస్తారు. మరకొరు ఈవీఎంల పనితీరును పర్యవేక్షిస్తారు. ప్రతి పోలింగ్ కేంద్రానికి నలుగురు చొప్పున 7,776 సిబ్బందిని నియమిస్తూ.. వీరికి అదనంగా మరో 20 శాతం మంది ఉద్యోగులను రిజర్వులో ఉంచేలా ఉన్నతాధికారులు కార్యాచరణ రూపొందించారు. ప్రభుత్వ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల కనీస వేతనం ఆధారంగా పీఓ, ఏపీఓ, ఓపీఓలను నియమించారు. జిల్లాలోని నాగర్‌కర్నూల్, కల్వకుర్తి, కొల్లాపూర్, అచ్చంపేటతో పాటు జడ్చర్ల నియోజకవర్గం పరిధిలోని ఊర్కొండ మండలం సంబంధించి మొత్తం 909 పోలింగ్ కేంద్రాల్లో 20 శాతం అదనంగా 4,552 మందిని మొదటి ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేశారు. అందులో 1,138 మంది పీఓలు, 1,138 మంది ఏపీఓలు, 2,276 మంది ఓపీఓలు ఉన్నారు.

నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్లు, సిబ్బంది వివరాలు

నియోజకవర్గం	పోలింగ్ కేంద్రాలు	ఓటర్లు	పోలింగ్ సిబ్బంది	సెక్టోరల్ అధికారులు
వనపర్తి	296	2,72,653	1,184	33
జోగుళాంబ గద్వాల	303	2,55,866	1,212	34
అలంపూర్	290	2,39,079	1,160	33
నాగర్‌కర్నూల్	259	2,38,133	1,036	29
అచ్చంపేట	265	2,47,621	1,060	30
కల్వకుర్తి	262	2,42,962	1,048	30
కొల్లాపూర్	269	2,38,459	1,076	30
మొత్తం	1,944	17,34,773	7,776	219



తహసీల్దార్ కార్యాలయం ఎదుట..

రైతు ఆత్మహత్యాయత్నం


పెట్రోల్ పోసుకున్న రైతు నడిపి కురుమూర్తి

ధన్వాడ: మండలంలోని పాతపల్లికి చెందిన రైతు నడిపి కురుమూర్తి బుధవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన చోటు చేసుకుంది. బాధితుడి కథనం మేరకు.. పాతపల్లిలోని సర్వేనంబర్ 66, 65లో ఉన్న మూడెకరాల భూమిని అదే గ్రామానికి చెందిన నర్సింహులు కొనుగోలు చేయడంతో రిజిస్ట్రేషన్ చేసేందుకు భూ యజమానులు గురుప్రసాద్, రాఘవేందర్ కుటుంబీకులు తహసీల్దార్ కార్యాలయానికి వచ్చారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కురుమూర్తి కార్యాలయానికి చేరుకొని ఆ భూమిని 50 ఏళ్లుగా తామే సాగు చేస్తున్నామని.. తమకు తెలియకుండా రిజిస్ట్రేషన్ ఎలా చేస్తారని అడ్డుకున్నారు. ఈ విషయాన్ని అధికారులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రిజిస్ట్రేషన్ చేయొద్దంటూ కార్యాలయం ఎదుట పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకునే ప్రయత్నం చేయగా సిబ్బంది అడ్డుకున్నారు. తహసీల్దార్ సింధూజ వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా.. భూ యజమానికి పట్టాదారు పాసుపుస్తకం ఉందని, స్లాట్ బుక్ చేసుకోవడంతో ఎలాంటి అభ్యంతరాలు లేకపోవడంతో రిజిస్ట్రేషన్‌కు అంగీకరించినట్లు తెలిపారు. అభ్యంతరం తెలిపిన రైతు గతంలో ఎప్పుడైనా ఫిర్యాదు చేసి ఉంటే ఫిర్యాదు పుస్తకంలో నమోదు చేసి ఉండేదని, రిజిస్ట్రేషన్ సమయంలో సంబంధిత వ్యక్తికి సమాచారం చేరవేస్తామని వివరించారు. అనంతరం వీరితో పాటు గ్రామానికి చెందిన మరికొందరు సర్వేనంబర్ 66, 65, 77, 78, 164, 165లో ఖాస్తులో ఉన్నామంటూ తహసీల్దార్‌కు ఫిర్యాదు అందజేశారు.

నీటి బకెట్‌లో పడి చిన్నారి మృతి


మమ్మి (ఫైల్)

నవాబుపేట: చిన్నారి ఆడుకుంటూ నీటి బకెట్‌లో పడి మృతి చెందిన ఘటన మండలంలో చోటు బుధవారం రాత్రి చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా.. మండలంలోని తిమ్మయ్యపల్లి చెందిన అరుణ, కురుమూర్తికి సాయి, మమ్మి(13 నెలలు) సంతానం. బుధవారం రాత్రి ఇంట్లో అందరూ భోజనం ముగించుకున్న తర్వాత ప్లేట్లు, సామాన్లను తల్లి అరుణ శుభ్రం చేస్తుండగా, ఆమె వెంట చిన్నారి మమ్మి వచ్చి బకెట్‌ను పట్టుకుని ఆడుకుంటుంది. తల్లి సామాన్లు కడిగి వాటిని ఇంట్లో సర్దేందుకు వెళ్లింది. అంతలోపే ప్రమాదవశాత్తు నీటి బకెట్‌లో పడిపోయింది. తల్లి వచ్చి చూసే సరికి చిన్నారి బకెట్‌లో తలకిందులుగా కనిపించింది. చిన్నారిని బయటికి తీసి చూడగా అప్పటికే శ్వాస ఆగిపోయింది. స్థానిక ఆర్‌ఎంపీని పిలిపించి చూపించగా అప్పటికే చిన్నారి మృతి చెందింది. దీంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కవిత్వం జీవితసారం నుంచి ఉద్భవిస్తుంది


పీయూలో కవితా సమ్మేళనం ఆరంభించిన ఆచార్యులు, అధ్యాపకులు

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: కవిత్వం జీవితసారం నుంచి ఉద్భవిస్తుందని పీయూ తెలుగుశాఖ అధ్యక్షురాలు డా.ఎస్. సంధ్యారాణి అన్నారు. బుధవారం పాలమూరు యూనివర్సిటీలో ఉగాది కవితా సమ్మేళనం– కవితా పోటీలు నిర్వహించారు. ఇందులో సుమారు 50 మంది విద్యార్థులు కవితాగానం చేసి ఆహుతులను ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కవిత్వం హృదయ ద్వారాలను తెరిచే ఆయుధం కావాలన్నారు. జడ్చర్లలోని బీఆర్ఆర్ డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు సుభాషిణి మాట్లాడుతూ కప్పి చెబితే కవిత్వం.. విప్పి చెబితే విమర్శ అవుతుందన్నారు. కవిత్వం నిగూఢ అర్థాన్ని ఇచ్చేదిగా ఉండాలన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా వైస్ ప్రిన్సిపాల్ డా.మన్నెమోని కృష్ణయ్య, అధ్యాపకురాలు సుభాషిణి, డా.వంగర భూమయ్య వ్యవహరించారు. కార్యక్రమంలో పీయూ ఆచార్యులు డా.బి.రవీంద్రగౌడ్, డా.తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

మట్టి ట్రాక్టర్లు, జేసీబీ స్వాధీనం



కేటీదొడ్డి: ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్న 3 ట్రాక్టర్లు, జేసీబీ పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని నందిన్నెలో బుధవారం ఓ ఇంటి నిర్మాణానికి ట్రాక్టర్ల ద్వారా మట్టిని తరలిస్తున్నారని గ్రామస్తులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి వెళ్లి పరిశీలించగా, మూడు ట్రాక్టర్లు, జేసీబీని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తనిఖీల్లో నగదు సీజ్

మహబూబ్‌నగర్ క్రైం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు చేస్తున్న వాహనాల తనిఖీల్లో బుధవారం జిల్లాలో రూ.8.36లక్షల నగదు సీజ్ చేశారు. వన్‌టౌన్ పోలీసులు క్లాక్‌టవర్ వద్ద తనిఖీ చేయగా సాహా అనే వ్యక్తి వద్ద రూ.3లక్షలు, టూటౌన్ పోలీసులు న్యూటౌన్‌లో చేసిన తనిఖీల్లో సాయిక్రిష్ణ వద్ద రూ.91వేలు, ఆర్టీసీ బస్టాండ్ వద్ద కె.సందీప్‌గౌడ్ నుంచి రూ.2.95లక్షల నగదు సీజ్ చేశారు. హన్వాడ పోలీసులు చేసిన తనిఖీల్లో రూ.1.50లక్షల నగదు సీజ్ చేశారు.

కేటీదొడ్డి: మండలంలోని నందిన్నె చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీల్లో నందిన్నె వైపు వస్తున్న వడ్లందొడ్డికి చెందిన నరేష్ నుంచి రూ.53,500 నగదును పట్టుకున్నారు.

కృష్ణా: మండలంలోని రాష్ట్ర సరిహద్దులో గల కృష్ణా చెక్‌పోస్టులో బుధవారం ఎస్‌ఐ ఎండీ నవీద్ ఆధ్వర్యంలో పోలీసులు తనిఖీ చేస్తుండగా కర్ణాటక నుంచి వస్తున్నా ఎండీ అష్పక్ కారులో రూ.2.92లక్షల నగదు లభించిందని, వాటికి ఎలాంటి ధ్రువపత్రాలు లేనందున సీజ్ చేసినట్లు తెలిపారు.

చిన్నచింతకుంట: మండలంలోని లాల్‌కోట చౌరస్తాలో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్ వద్ద బుధవారం రాత్రి యాదాద్రి జిల్లా శేరిగూడెం చెందిన కొల్లూరు లింగస్వామి మరికల్ నుంచి హైదరాబాద్‌కు కారులో వెళ్తుండగా రూ.60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.


నందిన్నె చెక్‌పోస్టు పట్టుకున్న నగదుతో పోలీసులు


కృష్ణా చెక్‌పోస్టులో సీజ్ చేసిన నగదుతో పోలీసులు

గోవిందపూర్‌కు అధికారులు

గ్రామస్తులతో మాట్లాడి వివరాల సేకరణ

- నివాస ప్రదేశంలో తాగునీటి వసతి కల్పించేందుకు చర్యలు


కొత్త గ్రామంలో వసతులను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

తాంసి: కిడ్నీ వ్యాధితో ఉన్న ఊరిని వదిలివెళ్లిన ఆ గిరిజనుల గోసను కళ్లకు కట్టేలా వివరించిన 'సాక్షి'కథనం అధికార యంత్రాంగాన్ని కదిలించింది. ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండలం కమట్‌వాడ జీపీ పరిధిలోని గోవింద్‌పూర్ గిరిజన గ్రామాన్ని అధికారులు బుధవారం సందర్శించారు. 'కిడ్నీ వ్యాధితో ఊరు ఖాళీ'శీర్షికన సాక్షి మెయిన్‌లో కథనం ప్రచురితమైంది. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు పంచాయతీరాజ్, వైద్య, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గ్రామాన్ని సందర్శించి పలు వివరాలు సేకరించారు. డీఎల్‌పీఓ ఫణిందర్‌తో పాటు ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూస్ ఏఈ తదితరులు గిరిజనులు విడిచి వెళ్లిన గ్రామాన్ని పరిశీలించారు. అక్కడ ఉన్న వసతులతో పాటు తాగునీటికి గ్రామస్తులు ఉపయోగించిన చేతిపంపులను పరిశీలించారు. గ్రామాన్ని విడిచి వెళ్లడానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం నివా సం ఉన్న ప్రదేశంలో తాగునీరు, ఇతర అవసరాల కు ఏ నీటిని ఉపయోగిస్తున్నారని అడగ్గా, తాగేందుకు పక్కన ఉన్న ధనోరా నుంచి ఆటో ద్వారా మినరల్ వాటర్ తెప్పించుకుంటున్నామని చెప్పారు. ఇతర అవసరాలకు పక్కన ఉన్న వ్యవసాయబావి నీటిని వాడుకుంటున్నామన్నారు. ఆ బావిలోని నీటిని అధికారులు పరిశీలించారు. శాంపిళ్లు సేకరించి పరీక్ష చేయాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి డీఎల్‌పీఓ సూచించారు. ప్రస్తుతమున్న చోట ట్యాంక్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరారు. కలెక్టర్‌కు విన్నవించి ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పారు.

వైద్యశిబిరం ఏర్పాటు

భీంపూర్ పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి నిఖిల్‌రాజ్ ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. కిడ్నీతో పాటు ఇతర వ్యాధిగ్రస్తుల వివరాలు నమోదు చేసినట్టు తెలిపారు. కిడ్నీ సంబంధ వ్యాధికి గల కారణాలు తెలుసుకునేందుకు త్వరలోనే మరో క్యాంపు ఏర్పాటు చేస్తామన్నారు.


పరిశ్రమలో రియాక్టర్ పేలటంతో కమ్ముకున్న పొగ


ఎస్‌బీ ఆర్గానిక్ పరిశ్రమ వద్ద గుమిగూడిన గ్రామస్తులు, ఉద్యోగులు


ఎస్‌బీ పరిశ్రమను పరిశీలిస్తున్న మంత్రి కొండా సురేఖ

రసాయన పరిశ్రమలో పేలిన రియాక్టర్

ఘోర ప్రమాదంలో పరిశ్రమ యజమాని సహా ఐదుగురు మృత్యువాత

- 30 మందికి పైగా కార్మికులకు గాయాలు.. ఏడుగురి పరిస్థితి విషమం
- మృతులు వివిధ రాష్ట్రాలకు చెందిన వారిగా గుర్తింపు
- సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఘటన

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/ హత్నూర/ సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం చందాపూర్‌లో ఉన్న ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో ఘోర అగ్ని ప్రమాదం జరిగింది. పరిశ్రమలో ఉన్న ఆయిల్ రియాక్టర్ బుధవారం సాయంత్రం అకస్మాత్తుగా పేలిపోయింది. దీంతో అగ్నికీలల్లో చిక్కుకుని పరిశ్రమ యజమానుల్లో ఒకరైన హైదరాబాద్‌కు చెందిన రవి (45), ఆంధ్రప్రదేశ్, తమిళనాడులకు చెందిన ప్రొడక్షన్ ఆఫీసర్లు సుబ్రహ్మణ్యం (36), దయానంద్ (48), మధ్యప్రదేశ్‌కు చెందిన మెయింటెనెన్స్ ఇన్‌చార్జి సురేష్ పాల్ (45) సజీవ దహనమయ్యారు. చందాపూర్ గ్రామానికి చెందిన కార్మికుడు చాకలి విష్ణు (35) హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ప్రమాదంలో మొత్తం ఐదుగురు మరణించారని సుమారు 30 మందికి పైగా కార్మికులు తీవ్రంగా గాయపడినట్లు కలెక్టర్ వల్లూరు క్రాంతి బుధవారం రాత్రి ప్రకటించారు. గాయపడిన వారిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి, స్థానిక ఎంఎన్‌ఆర్ ఆసుపత్రికి, హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రులకు తరలించినట్లు తెలిపారు. గాయపడిన వారిలో ఏడుగురి పరిస్థితి విషమంగా ఉందని వివరించారు. రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలు, జిల్లా ఎస్పీ రూపేష్, వివిధ శాఖల అధికారులు ఘటనా స్థలాన్ని సందర్శించారు.


రవివర్మ


విష్ణు

పేలుడు ధాటికి కంపించిన భూమి

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో సుమారు 200 మంది వరకు షిఫ్టుల వారీగా పనిచేస్తున్నారు. సాయంత్రం 4.30 గంటల సమయంలో సుమారు 60 మంది కార్మికులు విధుల్లో ఉండగా పెద్ద శబ్దంతో రియాక్టర్ పేలింది. పేలుడు ధాటికి పరిశ్రమలో ఉన్నవారు ఎగిరి కొన్ని మీటర్ల దూరంలో చెల్లాచెదురుగా పడిపోయారు. మంటల్లో కాలి మరణించినవారు, తీవ్రంగా గాయపడిన వారితో భీతావహ పరిస్థితి నెలకొంది. బాధితుల ఆర్తనాదాలు మిన్నంటాయి. ఆవరణంతా దట్టమైన పొగ అలుముకుంది. పరిశ్రమతో పాటు, చుట్టుపక్కల ఉన్న భవనాలు ధ్వంసమయ్యాయి. సుమారు ఐదు కిలోమీటర్ల దూరం వరకు భూమి కంపించడం, ఇంటి పైకప్పులు సైతం ఎగిరిపోవడంతో స్థానికులు భయభ్రాంతులకు గురయ్యారు. రెడ్డిఖానాపూర్‌లో భూమి కంపించిందని కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలం మల్లుపల్లికి చెందిన నారాయణ తెలిపారు.

కార్మికుల కుటుంబాల ఆందోళన

పేలుడుతో అగ్ని కీలలు ఎగసిపడ్డాయి. చెలరేగిన మంటలు రెండో రియాక్టర్‌కు కూడా అంటుకోవడంతో అది కూడా పేలుతుందని అధికారులు భయపడ్డారు. ముందు జాగ్రత్తగా చుట్టుపక్కల వారందరినీ అక్కడి నుంచి తరలించారు. పరిశ్రమ ఎదుట కార్మికుల కుటుంబసభ్యులు, బంధువులు ఆందోళన నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటల తర్వాత మృతదేహాలను పోస్టు మార్టం నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పరిశ్రమను పరిశీలించిన మంత్రులు

మంత్రులు కొండా సురేఖ, దామోదర రాజనర్సింహలు కూడా ఘటనా స్థలానికి చేరుకున్నారు. పరిశ్రమను పరిశీలించి ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. సహాయక చర్యలు వేగవంతం చేయాలని, బాధితులకు మెరుగైన చికిత్స అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. మృతి చెందిన కార్మికుల కుటుంబాలతో పాటు, గాయపడిన కార్మికుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని కొండా సురేఖ హామీ ఇచ్చారు. పరిశ్రమల్లో భద్రత చర్యలు చేపట్టకపోవడం వల్లే ప్రమాదాలు సంభవించినప్పుడు కార్మికులు మరణిస్తున్నారని దామోదర రాజనర్సింహ పేర్కొన్నారు. అనంతరం ఎంఎన్‌ఆర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దిలీప్‌రెడ్డి, శ్రీనివాస్, మస్తానయ్య, పూడి కుమార్‌రెడ్డి, సీహెచ్ భాస్కర్, సాయికుమార్, ధన్‌రాజ్, మాధవరావు ,అజయ్ పరిహార్, మాధవ్ సింగ్, అశోక్ సింగ్ , రాజేష్, నరసింహులు, ఉద్ధవ్, మల్లేశంలను మంత్రి పరామర్శించారు.

ప్రముఖుల దిగ్భ్రాంతి

ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో ఐదుగురు మరణించడంపై రాష్ట్ర గవర్నర్ సీపీ రాధాకృష్ణన్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందించడానికి చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ యంత్రాంగానికి సూచించారు. సీఎం రేవంత్‌రెడ్డి కూడా ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం ఆయన ప్రమాదంపై సమీక్ష నిర్వహించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా ఫైర్ సర్వీసెస్ డీజీ నాగిరెడ్డిని ఆదేశించారు. కాగా మృతుల కుటుంబాలకు బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ సంతాపం తెలియజేశారు. తీవ్రంగా గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్యం అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలం చెల్లిన రియాక్టర్!

పరిశ్రమల శాఖ ప్రాథమిక నిర్ధారణ

సాక్షిప్రతినిధి, సంగారెడ్డి: ఎస్‌బీ ఆర్గానిక్స్ పరిశ్రమలో పేలిపోయిన రియాక్టర్ కాలం చెల్లినదిగా పరిశ్రమల శాఖ వర్గాలు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. ఈ కారణంగానే రియాక్టర్ నుంచి ఆయిల్ లీకేజీ జరిగి అగ్ని ప్రమాదానికి దారితీసిందని, రియాక్టర్ పేలిపోయిందని అధికారులు భావిస్తున్నట్లు తెలిసింది. కాగా ప్రమాదంపై ప్రాథమిక విచారణ ప్రారంభించామని, ఇప్పుడే ఏమీ చెప్పలేమని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఇలావుండగా పరిశ్రమలో మొత్తం మూడు యూనిట్లు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. యూనిట్ -1లో ప్రమాదం జరిగింది. ఇందులో గైనిడైన్ నైట్రేట్, గైనిడైట్ కార్బొనేట్ తయారవుతుందని అధికారులు తెలిపారు. ఇవి పేలుడు పదార్థాలకు సంబంధించిన ఉత్పత్తులని వివరించారు. మిగతా రెండు యూనిట్లలో బల్క్‌డ్రగ్స్ తయారవుతాయని పేర్కొన్నారు.

కొత్త రుణాలు కావాలా..

పాత అప్పు కట్టండి

రైతులకు తేల్చి చెప్తున్న బ్యాంకులు ● మౌఖిక ఒత్తిళ్లు.. లీగల్ నోటీసులు సైతం జారీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో రైతులకు రుణాలు ఇచ్చిన బ్యాంకులు వారి ముక్కుపిండి మరీ తిరిగి వసూలు చేస్తున్నాయి. లీగల్ నోటీసులు, మౌఖిక ఆదేశాలు, ఒత్తిళ్లతో వడ్డీతో సహా రాబట్టుకుంటున్నా యి. కొన్ని బ్యాంకులు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద ఎంతో కొంత తగ్గించి వసూలు చేస్తున్నాయి. కొత్త రుణాలు కావాలంటే పాత అప్పు చెల్లించాల్సిందేనంటూ మెడపై కత్తి పెట్టినట్లుగా వ్యవహరిస్తున్నా యి. కొన్ని బ్యాంకులు రైతుల ఖాతాల్లోని రైతుబంధు సొమ్మును లాగేసుకుంటున్నాయి. దీంతో కొందరు రైతులు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తెచ్చి మరీ బ్యాంకులకు చెల్లిస్తున్నారు. రుణమాఫీ జరుగుతుందనే ఆశతో అప్పులు తిరిగి చెల్లించలేదని, రుణమాఫీ జరగకపోగా వడ్డీ తడిసిమోపెడు అవుతోందని గగ్గోలు పెడుతున్నారు. రుణమాఫీ జరిగేవరకు వేచి చూడాలని వేడుకుంటున్నా బ్యాంకులు వినడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు బ్యాంకులు నోటీసులు..మరోవైపు వ్యవసాయశాఖ చేతులెత్తేయడం, రుణమాఫీ ఎప్పుడు జరుగుతుందో తెలియక, కొత్తగా అప్పు పుట్టే పరిస్థితి లేక రైతులు నలిగిపోతున్నారు.

ముందుకు సాగని రూ.2 లక్షల రుణమాఫీ

తమ పార్టీని గెలిపిస్తే రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రకటించింది. ఇప్పుడదే పార్టీ అధికారంలోకి వచ్చింది. కానీ నాలుగు నెలలైనా ఇప్పటివరకు రుణమాఫీకి సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదు. కనీసం మార్గదర్శకాలు కూడా ఖరారు చేయలేదు. కానీ రూ.2 లక్షల వరకు రుణాన్ని మాఫీ చేయాలంటే రూ.30 వేల కోట్లు అవసరమవుతాయని మాత్రం ప్రభుత్వం అంచనా వేసింది. దీంతో వ్యవసాయ శాఖ అధికారులు.. ఎలా చేయాలి? ఏ తేదీ వరకు రుణమాఫీ చేయాలి అన్న అంశంపై తర్జనభర్జన పడుతున్నారు.



ఇప్పట్లో సాధ్యం కాదా?

ఎన్నికల కోడ్‌తో ఇప్పటికిప్పుడు రుణమాఫీకి మార్గదర్శకాలు ఖరారు చేయడం, ఇతరత్రా ప్రక్రియ మొదలు పెట్టడం కానీ సాధ్యం కాదని అధికారులు అంటున్నారు. దీంతో జూన్ మొదటి వారం వరకు రుణమాఫీపై అడుగు ముందుకు పడే అవకాశం లేదు. మరోవైపు వానాకాలం సీజన్ జూన్ నుంచి ప్రారంభం కానుంది. ఇందుకు మే నుంచే రైతులు సిద్ధం అవుతుంటారు. విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయడం, త్వరగా వర్షాలు కురిస్తే దుక్కులు దున్నడానికి సన్నాహాలు చేసుకుంటుంటారు. ఇంకోవైపు ఏప్రిల్ నుంచే వానాకాలం సీజన్ పంట రుణాల ప్రక్రియను బ్యాంకులు ప్రారంభిస్తాయి. కానీ రుణమాఫీ జరగకుంటే కొత్త రుణాలు ఇచ్చే పరిస్థితి లేదు. దీంతో అప్పులు తిరిగి చెల్లించాలని, రెన్యువల్ చేసుకోవాలని బ్యాంకులు నోటీసులు జారీ చేస్తుండటంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడుతున్నారు.

> "బ్యాంకుల్లో రైతు రుణాలు ఉన్నవాళ్లెవ్వరూ కట్టకండి.. మేం అధికారంలోకి రాగానే రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తాం"
> అప్పట్లో పలు ఎన్నికల ప్రచార సభల్లో ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి

ముందు చెల్లించండి.. తర్వాత సర్దుబాటు చేస్తాం

రాష్ట్రంలో ప్రతి ఏటా సగటున 42 లక్షల మంది వరకు రైతులు బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకుంటారు. రుణం తీసుకున్న రైతులు మూడు సీజన్లలోగా బకాయిలు చెల్లిస్తేనే తదుపరి రుణం తీసుకోవడానికి అర్హులవుతారు. అయితే ప్రభుత్వం రుణమాఫీ చేస్తామని ప్రకటించడంతో రైతులు తమ బకాయిలను చెల్లించలేదు. మరోవైపు దీర్ఘకాలంగా బకాయిలు పేరుకుపోయిన వారు కూడా అవి చెల్లించలేదు. ఈ నేపథ్యంలో బ్యాంకులు చెప్పిన ప్రకారం పాత అప్పులు చెల్లించాలని వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. ప్రభుత్వం రుణమాఫీ నిధులు విడుదల చేశాక సర్దుబాటు చేస్తామని చెబుతున్నారు. రుణాలు రెన్యువల్ చేసుకోకపోతే రైతులు డిఫాల్టర్లుగా మారిపోతారు. అయితే కొన్ని బ్యాంకులు రైతుబంధు సొమ్మును జమ చేసుకోవడం ద్వారా రెన్యువల్ చేయడం గమనార్హం. కాగా తాము రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారమే నడుచుకుంటామని, రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకోవడం సాధ్యం కాదని ఒక బ్యాంకు అధికారి 'సాక్షి'కి చెప్పారు. బకాయిలు పేరుకుపోతే ఎవరినైనా డిఫాల్టర్లుగా ప్రకటిస్తామని అన్నారు. లక్షలాది మంది రైతుల రుణ బకాయిలు పేరుకుపోయి ఉన్నాయని, అందుకే నోటీసులు ఇస్తున్నామని స్పష్టం చేశారు. పాత రుణాన్ని అలాగే ఉంచి కొత్త రుణం ఇవ్వడం సాధ్యం కాదని వివరించారు.

అవిశ్వాస పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

- నేటి ఉదయం 11 గంటలకు ఓటింగ్
- హాజరుకానున్న ఆర్డీఓ పద్మావతి



అమరచింత: స్థానిక పుర కార్యాలయంలో గురువారం ఉదయం అవిశ్వాస పరీక్ష నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పుర కమిషనర్ నూరుల్ నదీం తెలిపారు. ఈ సమావేశానికి ఆర్డీఓ పద్మావతి హాజరవుతారని.. 11 గంటలకు ప్రారంభమయ్యే సమయానికి 10 మంది కౌన్సిలర్లలో ఏడుగురు సభ్యులు హాజరైతే ఓటింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయని అధికారులు వివరించారు. ఆరుగురు హాజరైనా ఫలితం ఉండదని.. అవిశ్వాసం వీగినట్లేనని తెలిపారు.

❒ అవిశ్వాసం నెగ్గేందుకు అవసరమైన కౌన్సిలర్లు సమావేశానికి హాజరయ్యేలా ప్రయత్నాలు చేస్తున్నట్లు మూడోవార్డు కౌన్సిలర్ విజయరాములు తెలిపారు. చైర్‌పర్సన్, వైస్ చైర్మన్‌ను గద్దె దించేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తున్నామని చెప్పారు.

❒ మెజార్టీ కౌన్సిలర్లు సమావేశానికి హాజరుకాకుండా చైర్‌పర్సన్ భర్త నాగభూషణం గౌడ్, వైస్ చైర్మన్ జీఎస్ గోపితో లోపాయికారి మంతనాలు చేస్తున్నట్లు సమాచారం. అవిశ్వాసం నెగ్గుతుందా.. వీగిపోతుందా అన్న చర్చ పట్టణంలో జోరుగా సాగుతుంది. ఏదేమైనా అవినీతిపై తమ పోరు ఆగదని ప్రతిపక్ష కౌన్సిలర్లు వెల్లడిస్తున్నారు.

జోరందుకున్న ఉల్లి విక్రయాలు

- క్వింటా గరిష్టంగా రూ.1,500.. కనిష్టంగా రూ.1,050

దేవరకద్ర: స్థానిక వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం ఉల్లి విక్రయాలు జోరందుకున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు వేలంలో పాల్గొని ఉల్లి కొనుగోలు చేశారు. రైతులు పెద్దఎత్తున అమ్మకానికి తేవడంతో మార్కెట్ ఆవరణ ఉల్లి కుప్పలతో నిండిపోయింది. మరోపక్క యాసంగిలో పండించిన వరి ధాన్యం కూడా అమ్మకానికి రావడంతో ఎక్కడ పడితే అక్కడ వరి ధాన్యాన్ని కుప్పలుగా పోశారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉల్లి వేలం కొనసాగింది. ఎండలను సైతం లెక్క చేయకుండా వ్యాపారులు ఆవరణలో తిరుగుతూ వేలంలో పాల్గొన్నారు. నాణ్యమైన ఉల్లిని నిల్వ చేసుకోవడానికి అవకాశం ఉండటంతో పెద్దఎత్తున కొనుగోలు చేశారు.

నిలకడగా ధరలు..

ఈ వారం కూడా ఉల్లి ధరలు నిలకడగా ఉన్నాయి. రెండు నెలలుగా వస్తున్న ధరలే నమోదయ్యాయి.


మార్కెట్ ఆవరణలో పోసిన ఉల్లి కుప్పలు

నాణ్యమైన ఉల్లి గరిష్టంగా రూ.1,500, కనిష్టంగా రూ.1,200 ధర పలికింది. మీడియం సైజు గరిష్టంగా రూ.1,100, కనిష్టంగా రూ.వెయ్యి విక్రయించారు. మార్కెట్‌కు సుమారు 5 వేల బస్తాల ఉల్లి అమ్మకానికి వచ్చింది. నాణ్యమైన ఉల్లి 45 కిలోల బస్తా రూ.650 నుంచి రూ.750 వరకు.. మీడియం సైజు ఉల్లి బస్తా రూ.500 నుంచి రూ.600 వరకు విక్రయించారు.

మధ్యాహ్నం తర్వాత వరి ధాన్యం టెండర్లు..

ఉల్లి వేలం పూర్తయిన తర్వాత వరి ధాన్యం టెండర్లు వేశారు. ఈ–నామ్ టెండర్లలో సోనామసూరి ధాన్యం క్వింటా గరిష్టంగా రూ.2,509, కనిష్టంగా రూ.2,359.. ఆముదాలు రూ.5,739 ధరలు లభించాయి. మార్కెట్‌కు దాదాపు 2 వేల బస్తాల వరి ధాన్యం అమ్మకానికి వచ్చింది.

ఉపాధి కూలీలకు రూ.600 ఇవ్వాలి

మహబూబ్‌నగర్ రూరల్: ఉపాధి హామీ కూలీలకు కనీస వేతనం రూ.600 ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నైపుణ్యం లేని మాన్యువల్ కార్మికులకు రాష్ట్రాల వారీగా వేతన రేట్లకు సంబంధించి గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నోటిఫికేషన్‌ను ఆలిండియా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం వ్యతిరేకిస్తుందన్నారు. ఉపాధి హామీ లక్ష్యాన్ని నెరవేర్చడానికి ఏమాత్రం సరిపోదన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదల, గ్రామీణ ప్రజల కొనుగోలు శక్తి తగ్గుదలను పరిగణలోకి తీసుకుంటే, మంత్రిత్వ శాఖ నుంచి ఇలాంటివి రావన్నారు. ఇండియన్ లేబర్ బ్యూరో ప్రచురించిన గ్రామీణ నెలవారి వేతన సూచికతోపాటు వేతనాలలో ప్రస్తుత సవరణ కూలీల జీవితాల అధ్వాన స్థితిని పరిష్కరించడంలో, ఉపాధి కూలీలకు కనీస వేతనం హక్కును నిర్ధారించడంలో విఫలమైందన్నారు. తక్షణమే ఉపాధి హామీ పథకం కింద కనీసం రూ.600 రోజువారీ వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి హన్మంతు, నాయకులు ఖాదర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి మోహన్

అద్భుత చిత్రం..

ఆయన సొంతం


కమ్యూనిటీ భవనంలో వేస్తున్న దేశ నాయకుల చిత్రాలు (ఫైల్)


చిన్నారులను ఆకట్టుకునేలా గీసిన బొమ్మలు

చిత్రలేఖనంలో రాణిస్తున్న హఫీజ్

- పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల గోడలపై అతడు గీసిన చిత్రాలే దర్శనం

మహమ్మదాబాద్: మండల కేంద్రానికి చెందిన హఫీజ్ యంత్రాలను మరిపించే విధంగా రంగురంగుల చిత్రాలు వేస్తూ అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. చిన్నప్పటి నుంచే చిత్రాలు గీయడం అలవాటు చేసుకున్న ఆయన అదే విద్యతో జీవితాన్ని కొనసాగిస్తూ అబ్బురపర్చే రంగురంగుల బొమ్మలు గీస్తూ చిత్రకళలో రాణిస్తున్నారు. తండ్రి ఖాజామైనుద్దీన్ చిన్నప్పుడే మృతిచెందడంతో తల్లి జైతున్‌బేగంకు ఆసరాగా ఉంటూ తనకు వచ్చిన కళతో కుటుంబాన్ని పోషించుకోవడంతో పాటు ముగ్గురు చెల్లెళ్ల వివాహాలు కూడా చేశారు. పాఠశాలలు, కళాశాలలు, వివిధ రకాల దుకాణాల బోర్డులు రాయడంతో పాటు గోడలపై దేశ నాయకులు, పండ్లు, కూరగాయల చిత్రాలు కూడా వేస్తున్నారు. హఫీజ్ వేసిన కొందరి దేశ నాయకుల చిత్రాలు చూస్తే జీవం పోసినట్లుగా కనిపిస్తాయి. డిగ్రీ పూర్తి చేసిన ఆయనకు ఎలాంటి ఉద్యోగం రాకపోవడంతో ఇదే వృత్తిని కొనసాగిస్తున్నారు. మహమ్మదాబాద్, గండీడ్, కుల్కచర్ల, మహబూబ్‌నగర్, హన్వాడ, కోస్గి మండలాల్లోని చాలా పాఠశాలలు, కమ్యూనిటీ భవనాల్లో ఎక్కడ చూసినా హఫీజ్ వేసిన చిత్రాలే దర్శనమిస్తాయి. ప్రైవేట్ పాఠశాలల్లో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులను ఆకట్టుకునే చిత్రాలు వేసి శభాష్ అనిపించుకుంటున్నారు. తన దగ్గరికి వచ్చే కొందరు విద్యార్థులకు ఈ కళను నేర్పిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు.

> **చిత్రకళ అంతరించిపోకూడదనే..**
> చిత్ర కళాకారులు తగ్గిపోతున్న నేటిరోజుల్లో వారి ప్రాముఖ్యత తెలుపుతూ గుర్తింపు తీసుకురావా లన్నదే ఉద్దేశ్యం. ఈ కళ అంతం కాకూడదనే కొందరి విద్యార్థులకు నేర్పిస్తున్నా. కళలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలి.
> – హఫీజ్, చిత్రకళాకారుడు

ముఖ్యమంత్రిని కలిసిన పద్మశ్రీ అవార్డు గ్రహీత


ముఖ్యమంత్రితో కిన్నెర మొగులయ్య

లింగాల: నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం అవుసలికుంటకు చెందిన పద్మశ్రీ అవార్డు గ్రహీత, 12 మెట్ల కిన్నెర వాయిద్యకారుడు దర్శనం మొగులయ్య బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖను ముఖ్యమంత్రి నివాసంలో కలిశారు. వారికి 12 మెట్ల కిన్నెరపై జానపద పాట పాడి వినిపించారు. తన పాటకు సీఎం, మంత్రి మంత్రముగ్ధులయ్యారని.. జానపద కళాకారులకు ప్రకటించిన రూ.25 వేల పింఛన్ ఇస్తామని సీఎం తెలిపినట్లు వివరించారు. అలాగే తన రెండో కుమారుడు మహేందర్‌కు మెరుగైన వైద్యం అందించనున్నట్లు చెప్పారని, ఇందుకుగాను వారికి కృతజ్ఞతలు తెలిపారు.

వీరజవాన్ యాదయ్య కుటుంబం..



వంగూరు: పదేళ్ల కిందట వీరమరణం పొందిన జవాన్ యాదయ్య కుటుంబం బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని హైదరాబాద్‌లో కలిశారు. యాదయ్య సతీమణి సుమతమ్మకు ఉద్యోగం, 5 ఎకరాల వ్యవసాయ భూమిని ఇటీవల సీఎం ప్రకటించడంతో సుమతమ్మ, ఆమె ఇద్దరు కుమార్తెలు కృతజ్ఞతలు తెలిపారు. పదేళ్లుగా ఎదురుచూసిన ఉద్యోగం, వ్యవసాయభూమిని సీఎం చేతుల మీదుగా పొందడం అదృష్టమని సుమతమ్మ వివరించారు. అయితే జవాన్ యాదయ్యది, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వగ్రామం మండలంలోని కొండారెడ్డిపల్లి.

పార్లమెంట్ ఎంపీ బరిలో 'బీసీ సమాజ్'

స్టేషన్ మహబూబ్‌నగర్: పార్లమెంట్ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీ బరిలో బీసీ సమాజ్ పోటీలో ఉంటుందని రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రధాన రాజకీయ పార్టీలు మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థులుగా రెడ్డి సామాజిక వర్గానికి కేటాయించడంపై తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేస్తూ తాము ఎన్నో రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సభలు, సమావేశాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, ప్రజాగర్జనల పేరిట రాజకీయ పార్టీలకు వినతిపత్రాలు ఇచ్చి బీసీ అభ్యర్థులకు సీట్లు కేటాయించాలని కోరామన్నారు. కానీ రాజకీయ పార్టీలు అగ్రవర్ణాలకే కేటాయించడంతో మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఉన్న 65శాతం బీసీ జనాభాను దృష్టిలో పెట్టుకొని ఈ సారి ఎంపీ బరిలో బీసీ సమాజ్ ఉంటుందన్నారు.


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సంగెం సూర్యారావు

అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు అన్యాయం చేస్తూ పార్టీలో ప్రాధాన్యతను తగ్గిస్తూ ఇబ్బందులకు గురిచేసిన సందర్భాలు చాలా జరిగాయని అన్నారు. ఇక చూస్తూ ఊరుకునే పరిస్థితి లేదని, బీజేపీలో చాలా మంది బీసీ నాయకులు తమ పదవులకు సైతం రాజీనామాలు చేసి స్వచ్ఛందంగా బయటకు వచ్చారన్నారు. ఇటువంటి ఘటనలను నిశితంగా పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చి మన ఓట్లు మనం వేసుకుందాం, మన బీసీ ఓట్లు మనకే నినాదంతో ఈ సారి పార్లమెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో సమావేశాలతో ముందుకెళ్లి బీసీల్లో చైతన్యం తీసుకొస్తామని తెలిపారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌సాగర్ మాట్లాడుతూ మహబూబ్‌నగర్ పార్లమెంట్ పరిధిలో ఎన్నో రోజులుగా బీసీ సమాజ్ ఆధ్వర్యంలో కార్యక్రమాలు, రౌండ్‌టేబుల్ సమావేశాలకు పెద్ద ఎత్తున బీసీ సమాజం నుంచి స్పందన వచ్చిందన్నారు. ఇదే స్ఫూర్తితో పార్లమెంట్ ఎన్నికల్లో బరిలో ఉంటూ బీసీలను ఏకతాటిపైకి తీసుకొచ్చి గెలిపించి బీసీల ఆత్మగౌరవాన్ని కాపాడుకుందామని అన్నారు. సమావేశంలో మహేందర్, సారంగి లక్ష్మీకాంత్, ధన్‌రాజ్, పురుషోత్తం, డీకే నాయి, సవారి సత్యం, రుద్రారం సత్యం, శేఖర్, శ్రీనివాస్, ప్రణీల్‌చందర్, విశ్వనాథ్, తిరుపతయ్య, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.